# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY | 9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 306 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | ఆదివారం 14 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## అద్భుత సదుపాయాలతో సిద్ధమైన చర్లపల్లి రైల్వే స్టేషన్...



- చర్లపల్లి రైల్వే స్టేషన్ 98 శాతం పూర్తయినట్లు తెలిపిన కేంద్రమంత్రి
- తెలంగాణలో నాలుగో అతిపెద్ద రైల్వే స్టేషన్ కానుందని వెల్లడి
- 9 ప్లాట్‌ఫాంలతో అందుబాటులోకి చర్లపల్లి రైల్వే స్టేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** చర్లపల్లి రైల్వే స్టేషన్ త్వరలో అందుబా టులోకి రానుందని, ఈ స్టేషన్ పనులు 98 శాతం పూర్తయ్యాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఈ స్టేషన్ ఫొటోలను ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

వివరాలు 2లో..




# ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్

- ప్రతి విషయంలో ప్రభుత్వ విధానం కీలకమని వెల్లడి
- కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు తప్పనిసరిగా ఉండాలన్న సీఎం
- గత సీఎంల వల్ల ఐటీ, ఫార్మా రంగాల్లో మనం ముందున్నామన్న రేవంత్ రెడ్డి
- కళాశాలల్లో ఏఐకి సంబంధించిన కోర్సులు ఉండాలన్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** తొలిసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్నది ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలకు సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జేఎన్టీయూ పరిధిలో కళాశాలల నిర్వాహకులకు ప్రభుత్వ విధానం తెలియాలన్నారు. ప్రభుత్వ విధానాలు అందరికీ తెలిసేలా ప్రస్తుత కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విషయంలో ప్రభుత్వ విధానం చాలా కీలకమన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్సుమెంట్స్ బకాయిలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కళాశాలలు నిరుద్యోగులను తయారు చేసే పరిశ్రమలుగా ఉండకూడదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందుతున్న దేశానికి సివిల్ ఇంజినీరింగ్ అత్యంత

వివరాలు 2లో..

## కౌంట్ డౌన్ నంబర్ 9

### కాంగ్రెస్‌లో చేరిన అరికపూడి గాంధీ



- హాట్ టాపిక్ గా బీఆర్ఎస్ ఎల్పీ విలీనం
- ఒక్కొక్కరుగా చేరుతున్న ఎమ్మెల్యేలు
- పంద్రాగస్టు నాటికి ఆపరేషన్ పూర్తి?
- అదే బాటలో ఎమ్మెల్సీలు కూడా..!

**హైదరాబాద్ పెన్ పవర్:** కారు ఖాళీ అవుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఒక్కొక్కరుగా హస్తం గూటికి చేరుతున్నారు. అధినేత బుజ్జగించినా.. ఫాం హౌస్ కు పిలుపించుకొని మాట్లాడినా ఫాయిదా ఉండటం లేదు. శనివారం (జూలై13) శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. నిన్న రాత్రి రాజేంద్రనగర్ శాసన సభ్యుడు ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ లో చేరిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా గ్రేటర్ పరిధిలోని మాధవరంగ కృష్ణారావు

వివరాలు 2లో..

## పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు వినతుల వెల్లువ

- ప్రతి శనివారం మంగళగిరిలోని టీడీపీ ఆఫీసుకు చంద్రబాబు
- చంద్రబాబు కోసం భారీగా తరలివచ్చిన ప్రజలు
- అందరితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి



**పెన్ పవర్ డెస్క్:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో వందల మంది నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వినతులు స్వీకరించారు. ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళుతున్న ముఖ్యమంత్రి...

వివరాలు 2లో..

## అలా అయితే కాంగ్రెస్ ఓడిపోయి... మనం అధికారంలోకి వచ్చినా ప్రయోజనంలేదు

- బీజేపీ భిన్నమైన పార్టీ అని అద్వానీ చెప్పేవారన్న గడ్కరీ
- ఇతర పార్టీల కంటే ఎంత భిన్నంగా ఉన్నామో అర్థం చేసుకోవాలని సూచన
- సామాజిక, ఆర్థిక సంస్కరణలకు రాజకీయాలు ఒక సాధనమని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీని గద్దె దింపడానికి దారితీసిన తప్పిదాలను మనం పునరావృతం చేయవద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సొంత పార్టీ బీజేపీని హెచ్చరించారు. బీజేపీ భిన్నమైన పార్టీ అని, అందుకే మరోసారి ఓటర్ల విశ్వాసాన్ని చూరగొన్నదన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ సీట్లు సాధించడంలో విఫలమైంది. ఫలితాలు వచ్చిన నెల రోజుల తర్వాత గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ చేసే పనినే మనం కొనసాగిస్తే, వారి అధికారం నుంచి నిష్క్రమించినా... మనం అధికారంలోకి వచ్చినా ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పిదాల వల్లే ప్రజలు బీజేపీని ఎన్నుకున్నారన్నారు. పనాజీ సమీపంలో జరిగిన గోవా బీజేపీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

వివరాలు 2లో..

## సీఎం కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించలేదు... లోక్ సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా

- జేఎన్టీయూ కార్యక్రమానికి ఆహ్వానం అందలేదన్న ఈటల రాజేందర్
- అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆహ్వానం అందించలేదని విమర్శ
- అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇవ్వాలని కోరుతానని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** కూకట్‌పల్లి జేఎన్టీయూలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందలేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తనకు ఆహ్వానం అందకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కార్యక్రమంలో స్థానిక ఎంపీ అయిన తనకు ఆహ్వానం పంపించకుండా అధికారులు ప్రోటోకాల్‌ను విస్మరించారన్నారు. ఈ అంశంపై లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఉద్దేశపూర్వకంగానే తనకు ఆహ్వానం ఇవ్వలేదని... ఆహ్వానం పలకకుండా అవమానిచారంటూ మండిపడ్డారు. అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇవ్వాలని లోక్ సభ స్పీకర్‌ను కోరుతానన్నారు. కనీసం శిలాఫలకంలో అయినా తన పేరు ఉందో లేదోనని ఆరా తీస్తున్నారన్నారు.

## చంద్రబాబుపై ఆధారపడ్డారని ఏపీకి మాత్రమే ఇస్తారా?

- విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సినవి ఇవ్వాలని డిమాండ్
- కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ చట్టంలో వున్నాయన్న బీఆర్ఎస్ నేత
- ఏపీకి కేంద్రం రూ.60 వేల కోట్లు ఇస్తే సంతోషమేనన్న వినోద్ కుమార్



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రం లో చంద్రబాబుపై, టీడీపీ పై ఆధా రపడ్డారు కాబట్టి ఆంధ్రప్ర దేశ్‌కు ఇచ్చిన హామీలు మాత్రమే నెరవే ర్చుతారా? అని బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్... నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విభజ న చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సినవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సినవి

వివరాలు 2లో..

## బస్సులను పెంచుతున్నాం...

### 1,000 బస్సులను కొనుగోలు చేశాం



- మరో 1,500 బస్సుల కోసం ఆర్డర్ ఇచ్చినట్లు వెల్లడి
- దసరా లోపు నల్గొండ జిల్లాకు 30 ఎక్స్‌ప్రెస్, 30 లగ్జరీ బస్సులను ఇస్తామన్న మంత్రి
- ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం డీఏ ఇచ్చామన్న మంత్రి

వివరాలు 2లో..

## ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామనేది వట్టి మాటే

- మోడల్ స్కూల్ టీచర్లకు రెండు వారాలు గడిచినా వేతనాలు రాలేదన్న హరీశ్ రావు
- గెస్ట్ లెక్చరర్స్‌కు ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శ
- గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తేసే కుట్ర అని ఆందోళన కనిపిస్తోందన్న మాజీ మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తు న్నట్లుగా గొప్పలు చెప్పుకుంటు న్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఒకటే తేదీన వేతనాలు చెల్లిస్తున్నామనేది కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. మోడల్ స్కూల్ టీచర్లకు గత ఏడు నెలలుగా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం లేదన్నారు.

వివరాలు 2లో..

## స్కూళ్లలో డ్రగ్స్ కట్టడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



- డ్రగ్స్ కట్టడికి హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులు, విద్యార్థులతో కలిసి ఏర్పాటు
- తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు అనుమతులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని పాఠశాలల్లో డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్‌ను అరికట్టేందుకు హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉపాధ్యాయులు,

వివరాలు 2లో..

## సంపాదకీయం

# తొలిఏకాదశి రోజు పేలాల పిండి ఎందుకు తినాలో తెలుసా..

హిందువుల మొదటి పండగ తొలి ఏకాదశి. హైందవ సంస్కృతిలో తొలి ఏకాదశికి విశిష్ఠ స్థానముంది. దీన్ని శయనైకాదశి' అని, హరి వాసరం, పేలాల పండగ అని కూడా పిలుస్తారు. ఆషాఢమాసంలో వచ్చే శుక్ల ఏకాదశి రోజు ఈ తొలి ఏకాదశి జరుపుకుంటారు. ఈఏడాది (2024) బుధవారం (జులై 17) తొలి ఏకాదశి వచ్చింది. ఈ సందర్భంగా.. ఈ పండుగ రోజు పేలాల పిండిని ఎందుకు తినాలో ఇప్పుడు తెలుసుకుందాం. పురాణాల ప్రకారం ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా'గా పిలుస్తారు. పురాణాల ప్రకారం.. శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై నాలుగు నెలల పాటు శయనిస్తాడు. అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో వచ్చే 'ప్రబోధినీ ఏకాదశి' ఆయన తిరిగి మేల్కొంటాడు. ఈ నాలుగు నెలల్ని చాతుర్మాసాలుగా వ్యవహరిస్తారు. తొలి ఏకాదశి నుంచి 4 నెలల పాటు చాతుర్మాసదీక్షను ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు స్వామివారు పాతాళ లోకంలో బలి చక్రవర్తి వద్ద ఉండి కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

**చాతుర్మాస దీక్ష**

ఈ నాలుగు నెలల్ని చాతుర్మాసాలుగా వ్యవహరిస్తారు. ఈ రోజునుంచి నాలుగు నెలల పాటు చాతుర్మాస దీక్షను ఆచరిస్తారు. ఉత్తరాయణం కంటే దక్షిణాయనంలో పండుగులు పర్వదినాలు ఎక్కువగావస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా సంభవిస్తాయి కాబట్టి ఈ కాలంలో ఆరోగ్య రక్షణకోసం నియమాలు ఎక్కువగా పాటించాలని ఈ కాలంలో వ్రతాలు, ఉత్సవాలు, నోములు ఎక్కువగా పెట్టారు.

**పేలాల పిండి ఎందుకు తినాలి?**

తొలి ఏకాదశి నాడు పేలాల పిండిని తప్పక తినాలని పెద్దలు చెబుతారు. పేలాలు పితృదేవతలకు ఎంతో ఇష్టమైనవి. అంతేకాకుండా మనకు జన్మనిచ్చిన పూర్వీకులను పండగ రోజున గుర్తు చేసుకోవడం మన బాధ్యత. వాతావరణ పరిస్థితుల్లో మార్పు వచ్చే కాలం కాబట్టి మన శరీరం ఆరోగ్యపరంగా అనేక మార్పులకు లోనవుతుంది. గ్రీష్మ రుతువు ముగిసిన తర్వాత వర్ష రుతువు ప్రారంభమయ్యే కాలంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఈ సమయంలో శరీరానికి పేలాల పిండి వేడిని కలగజేస్తుంది. అందువల్ల ఈ రోజున ఆలయాల్లో, ఇళ్లలో పేలాల పిండిని ప్రసాదంగా పంచడం ఆనవాయితీగా వస్తోంది.

**ఏమేమి తినకూడదంటే...**

సంవత్సరం మొత్తంలో వచ్చే 24 ఏకాదశులు ఉపవాసం ఉండడం లేకపోయినా ఈ చాతుర్మాస్యాల్లో వచ్చే ఎనిమిది ఏకాదశుల్కెనా ఉపవాసం ఉండడం మంచిది. ఈ ఎనిమిది ఏకాదశులలో వంకాయ, కరుబూజ, రేగి మున్నగునవి తినకూడదని చెప్తారు. ఆ రోజు( జులై 17)నుంచే చాతుర్మాస వ్రత దీక్ష ప్రారంభం అవుతుంది. వీరు ఈ నాలుగు మాసాల్లో ఒక్కో మాసంలో ఒక్కో రకమ్కెన వాటిని వదిలి పెడతారు. మొదటి నెలలో కూరలు, రెండవ నెలలు పెరుగు, మూడవ నెలలో పాలు, నాల్గవ నెలలో ద్విదళ (రెండాకులుండే) వాటితో చేసే ఆకు కూరలను వదిలిపెట్టాలి. ఈ మొత్తం వ్రతం అయ్యే వరకు నిమ్మపళ్ళు, అలసందలు, ముల్లంగి, గుమ్మడికాయ, చెరుకుగడలు, తినకూడదని శాస్త్రం చెపుతుంది. అందరూ కనీసం ఈ ఒక్కరోజ్కెనా ఉపవాసం చేసి ఎప్పుడూ భగవంతుని దగ్గరగా ఉండి.. లక్ష్మీనారాయణుల ఆశీస్సులు పొందుదాం...

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్

- మొదటి పేజీ తరువాయి

అవసరం అన్నారు. కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఈ కోర్సులు లేకుంటే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని హెచ్చరించారు. గత ముఖ్యమంత్రుల నిర్ణయాల కారణంగా మనం ఫార్మా, ఐటీ రంగాల్లో ముందున్నామని ప్రశంసించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కోర్సులు ఉండాలన్నారు. ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచాన్ని నడిపించబోతోందన్నారు. రాష్ట్రంలోని కళాశాలల్లో ఏఐకి సంబంధించిన కోర్సులను కూడా ప్రవేశపెట్టాలన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుందని హామీ ఇచ్చారు.
త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి అటానమస్ హోదా ఇస్తామన్నారు. పక్క రాష్ట్రాలతో పోటీపడే విధంగా కాకుండా ప్రపంచంతో పోటీ పడేవిధంగా మనం తయారు కావాలని సూచించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.

# కౌంట్ డౌన్ నంబర్ 9

## కాంగ్రెస్‌లో చేరిన అరికపూడి గాంధీ

- మొదటి పేజీ తరువాయి

(కూకట్ పల్లి), కేపీ వివేకానంద( కుత్బుల్లాపూర్), మర్రి రాజశేఖర్ రెడ్డి(మల్కాజ్ గిరి), సుధీర్ రెడ్డి (ఎల్బీనగర్), బండారు లక్ష్మారెడ్డి (ఉప్పల్), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు) కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు జహీరాబాద్, దుబ్బాక ఎమ్మెల్యేలు కొనింటి మాణిక్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా హస్తం గూటికి చేరుతారని తెలుస్తోంది. అరికపూడి గాంధీతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల సంఖ్య తొమ్మిదికి చేరింది. ఈ ఎనిమిది మంది కూడా చేరితే కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 17కు చేరుతుంది. ఇదిలా ఉండగా వీళ్లంతా ఈ వారం రోజుల్లోపే పార్టీ మారుతారని తెలుస్తోంది. బీఆర్ఎస్ ఎల్పీ విలీనానికి మొత్తం 26 మంది ఎమ్మెల్యేల బలం అవసరం ఉంటుంది. ఆరుగురు మినహా అంతా కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. పంద్రాగస్టులోపు ఆపరేషన్ పూర్తి చేసి బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేసుకొనే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని సమాచారం. లీగల్ గా ఆటంకాలు రాకుండా విమర్శలకు తావు లేకుండా పకడ్బందీ కాంగ్రెస్ అగ్రనేతలు చర్యలు తీసుకుంటున్నారని సమాచారం.

**కాంగ్రెస్ బలం**

| | |
|---|---|
| **గెలిచినవి** | **64** |
| సీపీఐ | 01 |
| చేరికలు | 09 |
| మొత్తం బలం | 75 |

**బీఆర్ఎస్**

| | |
|---|---|
| **గెలిచినవి** | **39** |
| బైపోల్ లాస్ | 01 |
| కోల్పోయిన ఎమ్మెల్యేలు | 09 |
| బలం | 29 |

# బస్సులను పెంచుతున్నాం...

## 1,000 బస్సులను కొనుగోలు చేశాం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా ప్రాంతాలకు బస్సుల సంఖ్యను పెంచుతున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్తగా 1,000 బస్సులను కొనుగోలు చేశామని, మరో 1,500 బస్సులకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి నల్గొండ–హైదరాబాద్ నాన్‌స్టాప్ ఏసీ, 3 డీలక్స్ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ... దసరా లోపు నల్గొండ జిల్లాకు 30 ఎక్స్‌ప్రెస్, 30 లగ్జరీ బస్సులను ఇస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు 21 శాతం డీఏ ఇచ్చామని గుర్తు చేశారు. రూ.280 కోట్ల బకాయిల్లో రూ.80 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ.200 కోట్లను నెలాఖరులోగా చెల్లిస్తామని తెలిపారు. ఆర్టీసీలో 3,035 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం నుంచి లగ్జరీ బస్సులు నడుపుతామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల నుంచి ఏసీ బస్సులు ప్రారంభిస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. త్వరలో నల్గొండ జిల్లాకు మరిన్ని బస్సులు తెస్తామన్నారు. కొత్త బస్సుల్లో నల్గొండకు 100 కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

# ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామనేది వట్టి మాటే

- మొదటి పేజీ తరువాయి


ఇది కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు.
ఈ నెలలో ఇప్పటికే రెండు వారాలు గడిచినప్పటికీ మోడల్ స్కూల్ రెగ్యులర్ టీచర్స్‌కు వేతనాలు అందలేదని, దీంతో వారు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 8న సగం మంది ఉద్యోగులకు మాత్రమే ప్రభుత్వం వేతనాలు చెల్లించిందన్నారు. చాలా ప్రాంతాల్లో వేతనాలు అందలేదన్నారు. మోడల్ స్కూల్స్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్, హవర్లీ బేస్ట్ టీచర్స్ దాదాపు 2 వేల మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.
జూనియర్ కాలేజీలలో పని చేసే గెస్ట్ లెక్చరర్స్‌కు ఇచ్చిన మాటను ప్రభుత్వం తప్పిందన్నారు. అధికారంలోకి రాగానే రూ.42 వేల వేతనం చెల్లిస్తామని చెప్పి... ఆ తర్వాత మాట తప్పిందన్నారు. పైగా వారిని మార్చి 31 నుంచి జులై 31 వరకే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగాలు నిలిపివేస్తే... వారు, వారి కుటుంబాలు ఏం కావాలని మండిపడ్డారు.
గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి విద్యాసంవత్సరానికి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తేసేందుకు కుట్ర చేస్తున్నట్లుగా వారు ఆందోళన చెందుతున్నారని... ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉందన్నారు. అభయహస్తం మేనిఫెస్టోలో హామి ఇచ్చినట్లుగా గెస్ట్ లెక్చరర్లకు భరోసా ఇవ్వడంతో పాటు, నెలకు రూ. 42 వేల వేతనం చెల్లించి, విద్యాసంవత్సరం చివరి వరకు ఉద్యోగ కాలాన్ని పొడగించాలని డిమాండ్ చేశారు.

# అలా అయితే కాంగ్రెస్ ఓడిపోయి... మనం అధికారంలోకి వచ్చినా ప్రయోజనంలేదు

- మొదటి పేజీ తరువాయి

బీజేపీ భిన్నమైన పార్టీ అని తన గురువు అద్వానీ చేసిన ప్రకటనను గుర్తు చేశారు. బీజేపీ అంటే భిన్నమైన పార్టీ అని అద్వానీ చెప్పేవారు... ఇతర పార్టీల కంటే మనం ఎంత భిన్నంగా ఉన్నామో మనమే అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పిదాల వల్ల బీజేపీని ప్రజలు ఎన్నుకున్నారని గుర్తించాలన్నారు. అదే తప్పులను మన పార్టీ చేయవద్దని హెచ్చరించారు. సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకు రావడానికి రాజకీయాలు ఒక సాధనమని కార్యకర్తలు గుర్తించాలన్నారు.

# ZP స్కూల్స్‌లో ప్రహరీ క్లబ్‌లు.. డ్రగ్స్ అరికట్టేందుకు మాస్టర్ ప్లాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు కాంగ్రెస్?ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లల్లో ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరం చేయడానికి ప్రహరీ క్లబ్ లు ఏర్పాటుచేయనున్నారు. పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ ఉంటాడు. వైస్ ప్రెసిడెంట్ గా సీనియర్ టీచర్ లేదా ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి పదో తరగతి వరకు ప్రతి క్లాసు లో ఇద్దరు విద్యార్థులు స్థానికంగా ఉండే పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్.. పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్ లో సభ్యులుగా ఉంటారు.పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధ మందులు, పదార్థాలు.. ఇతర రకాల వస్తువులు చేరకుండా నిరోధించడానికి ఈ క్లబ్ లు ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే పూర్తి గైడ్ లైన్స్ విడుదల చేయనుంది.

# స్కూళ్లలో డ్రగ్స్ కట్టడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మొదటి పేజీ తరువాయి

తల్లిదండ్రులు, పోలీసులు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులతో కలిసి ప్రహరీ క్లబ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యా కమిషనర్‌కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

# అద్భుత సదుపాయాలతో సిద్ధమైన చర్లపల్లి రైల్వే స్టేషన్...

- మొదటి పేజీ తరువాయి

అద్భుతమైన... అత్యాధునిక సదుపాయాలతో ఈ స్టేషన్ సిద్ధమైందని పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికలకు ముందే పూర్తి కావాల్సిన ఈ రైల్వే స్టేషన్ త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. రూ.434 కోట్ల బడ్జెట్‌తో ఈ స్టేషన్‌ను నిర్మించారు. ఇది తెలంగాణలో నాలుగో అతిపెద్ద రైల్వే స్టేషన్ కానుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ స్టేషన్‌లో 9 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీ తగ్గుతుందన్నారు. సుదూర ప్రాంత రైళ్లు, ఎంఎంటీఎస్ రైళ్లను మారడానికి ఎంతోమందికి ఈ స్టేషన్ మరింత అనుకూలంగా ఉంటుందన్నారు.

# చంద్రబాబుపై ఆధారపడ్డారని ఏపీకి మాత్రమే ఇస్తారా?

- మొదటి పేజీ తరువాయి

తప్పకుండా ఇవ్వాలన్నారు. శనివారం ఆయన విభజన హామీలపై మాట్లాడుతూ... కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి విభజన చట్టంలో వున్నాయన్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు ఇస్తే సంతోషమే అన్నారు.

# పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు వినతుల వెల్లువ

- మొదటి పేజీ తరువాయి

ఈ రోజు ఉదయం కూడా మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ కు వెళ్లారు. తన కోసం వేచి ఉన్న ప్రజలు, కార్యకర్తలను కలిశారు. ముందుగా గేటు వద్ద రాజమండ్రి నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. అనంతరం మీడియా రూంలో ప్రజలను, కార్యకర్తలను, వివిధ సమస్యలపై వచ్చిన వారిని కలిశారు. ఆరోగ్య సమస్యలు, భూ వివాదాలు, వ్యక్తి గత సమస్యలపై ప్రజలు సీఎంకు విన్నవించారు.
ఇక కార్యకర్తలు, నేతలు నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబును కోరారు.
నాడు తెలుగుదేశం ప్రభుత్వంలో పనిచేసిన బీమా మిత్రలు తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు.
విజయవాడకు చెందిన షేక్ ఆసిన్, మహ్మద్ ఇంతియాజ్ రాజధాని అమరావతి కోసం రూ.1 లక్ష విరాళంగా ఇచ్చారు. ఫర్నిచర్ షాపు నడుపుతున్న వీరు లక్ష విరాళం ఇవ్వడాన్ని చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఆశోక్ బాబు సహా పలువురు నేతలు పాల్గొన్నారు.
పాపకు రూ.16 కోట్ల ఇంజక్షన్ కోసం సాయం కోరిన బాధితులు
గుంటూరుకు చెందిన వెచ్చా ప్రీతమ్ దంపతులు తమ పాప హితైషిని తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఏడాది వయసున్న హితైషి తీవ్రమైన వ్యాధితో బాధపడుతోంది. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న పాపకు చికిత్స కోసం వారు ముఖ్యమంత్రిని కలిశారు. పాపకు ఉన్న జబ్బు నయం కావాలి అంటే %గశిశ్రీస్త్రవఅంఝు% అనే ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని ధర రూ.16 కోట్లు కావడంతో తల్లిదండ్రులు సాయం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఫండ్ రైజింగ్ కార్యక్రమం కూడా చేపట్టారు. మరో నెల రోజుల్లో ఈ చికిత్స అందించాల్సి ఉందని తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై వెంటనే పరిశీలన జరుపుతామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు.
అనంతరం తన ఛాంబర్ లో నేతలను చంద్రబాబు కలిశారు. పార్టీ అంశాలపై వారితో చర్చించారు.

# భారతి గారు అన్నారంటే అది డిఫరెంట్ మ్యాటర్: అంబటి రాంబాబు

### తల్లికి వందనం పథకంపై టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం

### నిమ్మల వీడియోపై వైసీపీ నేతల సెటైర్లు

### వైఎస్ భారతి వీడియోను తెరపైకి తెచ్చి కౌంటర్ ఇచ్చిన టీడీపీ నేతలు

### ప్రెస్ మీట్ పెట్టి స్పందించిన అంబటి రాంబాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** తల్లికి వందనం పథకంపై టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా, వైసీపీ నేత అంబటి రాంబాబు కూడా కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. టీడీపీ నేతలు వైఎస్ భారతి వీడియోను తెరపైకి తీసుకురావడం పట్ల ఆయన స్పందించారు. ఎన్నికలకు ముందు వాగ్దానాలు ఇచ్చి, ఆ తర్వాత విస్మరించే వ్యక్తి పేరు నారా చంద్రబాబునాయుడు అని వ్యాఖ్యానించారు. మేనిఫెస్టో అమలు చేయకుండా, అధికారంలోకి వచ్చిన ఈ నెలా పది రోజుల్లోనే ఎన్ని దుర్మార్గాలు చేశారో చూడండి అంటూ ధ్వజమెత్తారు. తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం ఇంకా అమలు చేయకపోవడం ఏంటని నిలదీశారు. మేనిఫెస్టోలో ఉన్న పథకాన్ని అమలు చేయకుండా, రెడ్ బుక్ పేరుతో తమపైనే ప్రతీకార దాడులు చేస్తున్నారంటూ మండిపడ్డారు. "మా పార్టీ ఆఫీసులు కూల్చేస్తారా... తప్పుడు జీవోలు ఇచ్చి మా ప్రజలను ఇబ్బంది పెడతారా... మాజీ ముఖ్యమంత్రి మీద కేసులు పెడతారా... ఎమ్మెల్యేలపైనా, మాజీ ఎమ్మెల్యేలపైనా కేసులు పెట్టి లోపల తోస్తారా... కక్ష సాధింపులు ఉండవు అన్నారు... ఆ మాటకు అర్థం ఇదేనా...? కక్ష సాధింపులు తప్ప ఈ ప్రభుత్వానికి రెండో పనే లేదు. ఈ వాస్తవాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఈ దుర్మార్గమైన పాలన ఇంకా నాలుగు సంవత్సరాలు 11 మాసాలు భరించాలా? అనే పశ్చాత్తాపం ప్రజల్లో ప్రారంభమయ్యే విధంగా నారా లోకేశ్ గారు చక్కని ప్రోగ్రామ్ నిర్ణయించారు... చాలా సంతోషం! రెడ్ బుక్ అమలు చేయాలి అంటూ గుంటూరులో పెద్ద పెద్ద పోస్టర్లు కనిపిస్తున్నాయి. కేసులు పెట్టి మమ్మల్నందరినీ లోపల వేయండి చూస్తాం. పద్దవాడు ఎప్పుడూ చెడ్డవాడు కాదు. తల్లికి వందనంపై మేం అడుగుతున్నామని భారతి గారి వీడియో తీసుకువచ్చారు. ఆ వీడియో పక్కనబెట్టి... 2019 ఎన్నికల్లో మా మేనిఫెస్టో ఏంటో చూడండి, ఈ ఎన్నికల్లో కూటమి మేనిఫెస్టో ఒక్కసారి చూడండి. కూటమి మేనిఫెస్టోలో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అన్నారు... మా మేనిఫెస్టోలో ప్రతి తల్లికి రూ.15 వేలు అని అన్నాం.... తేడా ఉంది కదా. భారతి గారు అన్నారు, రాంబాబు గారు అన్నారు అంటే అది డిఫరెంట్ మ్యాటర్. ఇదే విషయం షర్మిల గారు కూడా అన్నారు... ఆమెది వేరే విషయం. వదిన గారి మీద ఉన్న కోపమో, అన్న గారి మీద ఉన్న కోపమో... కుటుంబ కారణాల వల్ల ఆమె చంద్రబాబును సపోర్ట్ చేసే కార్యక్రమం చేస్తున్నారు" అంటూ అంబటి రాంబాబు విమర్శనాస్త్రాలు సంధించారు.

## డొనాల్డ్ ట్రంప్ ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలపై ఆంక్షలు ఎత్తివేసిన మెటా

### 2021లో క్యాపిటల్ బిల్డింగ్ పై ట్రంప్ అనుచరుల దాడి

### ట్రంప్ ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలు నిలిపివేసిన మెటా

### తాజాగా నిషేధం ఎత్తివేస్తూ మెటా నుంచి ప్రకటన విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలపై గతంలో విధించిన ఆంక్షలను మెటా తాజాగా ఎత్తివేసింది. ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ల మాతృసంస్థ మెటా ఇవాళ ఓ ప్రకటన చేసింది. రాజకీయ నేతల భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అనుమతించడం తమ బాధ్యత అని మెటా స్పష్టం చేసింది. అదే సమయంలో అభ్యర్థుల ఆలోచనలను, మాటలను అమెరికా ప్రజలు కూడా వినాలని సూచించింది. ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి సోషల్ మీడియా ఖాతాలను వినియోగించుకోవాలని పేర్కొంది. 2021లో క్యాపిటల్ బిల్డింగ్ పై ట్రంప్ అనుచరుల దాడి ఘటనతో ఆయన ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలను మెటా నిలిపివేయడం తెలిసిందే. ఇదే రీతిలో ఎక్స్ (ట్విట్టర్) కూడా గతంలో ట్రంప్ ఖాతాపై నిషేధం విధించి, ఆ తర్వాత ఎత్తివేసింది. అయినప్పటికీ ట్రంప్ తన ఎక్స్ ఖాతాను ఉపయోగించడంలేదు.

## తిరుమల క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

### వరుసగా రెండ్రోజులు సెలవులు

### తిరుమల కొండకు భారీగా తరలి వస్తున్న భక్తులు

### శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం

### నిన్న ఒక్కరోజే స్వామి వారికి రూ.4.69 కోట్ల ఆదాయం



**హైదరాబాద్ పెన్ పవర్:** వరుసగా రెండ్రోజులు సెలవులు రావడంతో తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. నేడు రెండో శనివారం కాగా, రేపు ఆదివారం కావడంతో తిరుమల కొండకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. సర్వదర్శనం టోకెన్లు లేకుండా క్యూలైన్లలోకి వస్తున్న భక్తులకు శ్రీవారి దర్శనానికి 30 గంటల వరకు సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్ మెంట్లు, నారాయణగిరి షెడ్లు అన్నీ నిండిపోయి, కృష్ణతేజ అతిథి గృహం వరకు భక్తుల క్యూలైన్లు కొనసాగుతున్నాయి. నిన్న (శుక్రవారం) స్వామివారిని 63,493 మంది భక్తులు దర్శించుకున్నారు. 31,676 మంది తలనీలాల మొక్కు సమర్పించుకున్నారు. నిన్న ఒక్కరోజే స్వామివారికి హుండీ ద్వారా రూ.4.69 కోట్ల ఆదాయం లభించింది.

## ఉన్నతాధికారులను డమ్మీలుగా మార్చేసి ఎస్సైలకు నేరుగా సీఎంవో నుంచి ఆదేశాలు ఇచ్చేవారు: పీవీ రమేశ్



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామాలపై నిఘా ఉంచేందుకు ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేసి ఏపీలో వాలంటీర్లు, సచివాలయాలు ఏర్పాటు చేశారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ పేర్కొన్నారు. ఓ కార్యక్రమంలో పీవీ రమేశ్ మాట్లాడుతూ... పోలీసులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను జగన్ సామ్రాజ్యానికి రక్షణ వ్యవస్థగా భావించారని ఆరోపించారు. ఉన్నతాధికారులను డమ్మీలుగా మార్చేసి... క్షేత్రస్థాయిలో ఉన్న ఎస్సైలకు సీఎంవో నుంచి నేరుగా ఆదేశాలు వెళ్లేవని అన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేసిన కార్యకర్తలను వాలంటీర్లుగా నియమించారని వెల్లడించారు. "కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు... విలేజ్ అసిస్టెంట్ నుంచి చీఫ్ సెక్రటరీ వరకు... ఒక్కొక్కరి కులం ఏమిటి, మతం ఏమిటి, ప్రాంతం ఏమిటి, వాళ్ల రాజకీయ పలుకుబడి ఏమిటి అని వాళ్ల నేపథ్యం రాసుకున్నారు. ఒక నెలరోజుల్లో కిందా మీదా పడి అందరినీ మార్చేశారు. వీళ్లందరినీ నియంత్రించడానికి ఒక వ్యక్తిని ఏర్పాటు చేశారు. ఆ వ్యక్తి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నేరుగా ఫోన్ చేసి ఎస్సైతో మాట్లాడతారు... మీరు సాయంత్రంలోగా చేస్తారా, లేదా? మీరేం చేశారో మాకు రిపోర్ట్ చేయండి అని ఆ ఎస్సైకి చెప్పేవారు. సాయంత్రంలోగా ఆ సబ్ ఇన్ స్పెక్టరే సీఎం ఆఫీసుకు ఫోన్ చేయాలి. మళ్లీ డీజీపీ గారికి ఏమీ తెలియదు.ఇది కాకుండా, వాలంటీర్ వ్యవస్థను కూడా తీసుకువచ్చారు. 2016 డిసెంబరు నుంచి ఐప్యాక్ వ్యవస్థలో పనిచేసి, 2019 ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తలుగా బూత్ లెవల్ లో పనిచేసిన వారిని, 2019 ఆగస్టులో వాళ్లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకున్నారు. వారికి గౌరవ వేతనంగా ఏటా రూ.2500 కోట్లను ప్రభుత్వం నుంచే జీతాలు చెల్లించేవారు. వార్డు, గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి మరో 1.50 లక్షల మంది ఉద్యోగులను నియమించుకున్నారు. ఒక్కో సచివాలయంలో 13 మంది ఉద్యోగులు ఉంటారు. గ్రామాల్లో ప్రజలు ఏం చేస్తున్నారో చూడడానికి, వారిని నియంత్రించడానికి వీళ్లను ఉపయోగించుకున్నారు" అని పీవీ రమేశ్ వివరించారు.

## పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలను చూసి బాధపడాల్సిన పనిలేదు: వినోద్ కుమార్

### నాడు బీఆర్ఎస్‌లో, నేడు కాంగ్రెస్‌లో చేరినప్పుడు అభివృద్ధి కోసమే అంటున్నారని విమర్శ

### నిత్యం పార్టీ మారే వారిపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్న వినోద్ కుమార్

### కేసీఆర్ కొత్త తరం నేతలను ప్రోత్సహిస్తారన్న మాజీ ఎంపీ

### రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలను చూసి బాధపడాల్సిన పనిలేదని బీఆర్ఎస్ సీనియర్ నేత వినోద్ కుమార్ అన్నారు. నాడు బీఆర్ఎస్‌లో చేరినప్పుడు అభివృద్ధి కోసమే చేరుతున్నట్లు చెప్పారని, ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరినప్పుడూ అదే మాట చెబుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... నిత్యం పార్టీలు మారే వారిపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. వాళు తిరిగి వస్తామన్నా ప్రజలు రానివ్వరని పేర్కొన్నారు. త్వరలో పార్టీ సమావేశాలు ఏర్పాటు చేసుకుందామన్నారు. కొత్త తరం నేతలను కేసీఆర్ ప్రోత్సహిస్తారన్నారు. బీఆర్ఎస్ ఓటమిపై ఆయన స్పందించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమే అన్నారు. కొన్నిసార్లు కొన్ని కారణాలతో ఓడిపోతుండవచ్చునని వ్యాఖ్యానించారు. వచ్చే ఐదేళ్ల తర్వాత బీఆర్ఎస్ బ్రహ్మాండమైన మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.
కేంద్రంలో టీడీపీ, జేడీయూ సహకారంతో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. చంద్రబాబు ఇటీవల ఢిల్లీకి వెళ్లి విభజన చట్టంలోని అంశాలపై మాట్లాడారని గుర్తు చేశారు. ఆ తర్వాత షెడ్యూల్ 13లో ఉన్న పెట్రో, కెమికల్, ఆయిల్ రిఫైనరీ హబ్ ఏపీకి ఇస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. ఇదే షెడ్యూల్ 13లో తెలంగాణకు కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉందని గుర్తు చేశారు. ఏపీకి పెట్రో కెమికల్ రిఫైనరీ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, కానీ తెలంగాణకు రావాల్సిన వాటిని ఇవ్వాలన్నారు. చంద్రబాబుపై కేంద్రం ఆధారపడినందువల్లే ఆయన అడిగినవి ఇచ్చిందన్నారు. తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలిచినా మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణకు ఐటీఐఆర్, కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు నవోదయ పాఠశాలలు ఇవ్వలేదన్నారు.

## 13 ఉపఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల ఎన్డీయే గెలుపు

### బీహార్‌లోని రూపాలిలో స్వతంత్ర అభ్యర్థి విజయం

### తమిళనాడులో డీఎంకే, బెంగాల్‌లో తృణమూల్ అభ్యర్థుల గెలుపు

### మధ్యప్రదేశ్‌లో బీజేపీ విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా జరిగిన 13 ఉప ఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల బీజేపీ, ఒకచోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. ఉపఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి, మూడు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది.
పశ్చిమ బెంగాల్‌లో 4, హిమాచల్ ప్రదేశ్‌లో 3, ఉత్తరాఖండ్‌లో 2, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఒక్కో స్థానంలో ఉప ఎన్నికలు జరిగాయి.
హిమాచల్ ప్రదేశ్‌లో డెహ్రా, నలాగఢ్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, హమీర్‌పూర్ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. మధ్యప్రదేశ్‌లోని అమరవారా నుంచి బీజేపీ అభ్యర్థి కమలేశ్ ప్రతాప్ షా విజయం సాధించారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులోని విక్రవాండిలో డీఎంకే, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్లౌర్‌లలో కాంగ్రెస్ గెలుపొందింది. పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రణఘాట్ సౌత్, బాగ్దా, మానిక్తలాలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. బీహార్‌లోని రూపాలిలో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు.

## జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ గృహ నిర్బంధం!



**హైదరాబాద్ పెన్ పవర్:** తనను గృహ నిర్బంధం చేసినట్లు జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కశ్మీర్ అమరుల దినోత్సవం సందర్భంగా 'మజార్ ఏ షుహదా'ని సందర్శించకుండా అడ్డుకోవడంలో భాగంగా తనను నిర్బంధించినట్లు ఆరోపించారు. 'మజార్ ఏ షుహదా'ను సందర్శించకుండా ఉండేందుకు తనను హౌస్ అరెస్ట్ చేశారన్నారు. కశ్మీర్ ప్రజల స్ఫూర్తిని అణచివేయలేరనడానికి అమరుల త్యాగాలే నిదర్శనమన్నారు. అమరులకు నివాళులు అర్పించడాన్ని నేరంగా పరిగణిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల వల్ల మన హక్కులు, గౌరవాన్ని కాపాడుకోవడం కోసం మరింత పోరాటం చేయాలనే సంకల్పం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తన గేట్‌కు తాళం వేసిన ఫొటోలను షేర్ చేశారు.
మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాను కూడా హౌస్ అరెస్ట్ చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. అమరవీరులకు నివాళులు అర్పించేందుకు వీలు లేకుండా అడ్డుకుంటున్నారని ఆయన పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1931లో అప్పటి కశ్మీర్ మహారాజుకు వ్యతిరేకంగా పోరాడిన 22 మంది నిరసనకారులు... సైన్యం చేతిలో ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలకు గుర్తుగా కశ్మీర్‌లో 'మజార్ ఏ షుహదా'ను ఏర్పాటు చేశారు.

## కేజ్రీవాల్ 8.5 కిలోలు తగ్గారు... షుగర్ లెవల్స్ తగ్గితే కోమాలోకి వెళ్లే ప్రమాదం!: ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్

### కేజ్రీవాల్‌ను వేధించాలని ఎన్డీయే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపణ

### కేజ్రీవాల్ అరెస్టయినప్పుడు 70 కిలోలు ఉండగా ఇప్పుడు 61.5కి తగ్గారని వెల్లడి

### షుగర్ లెవల్స్ పదేపదే తగ్గితే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుందని ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:** మద్యం పాలసీ కేసులో తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 8.5 కిలోలు తగ్గారని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ ఆరోపించారు. జైల్లో ఉండగా ఐదుసార్లు ఆయన బ్లడ్ షుగర్ పడిపోయిందన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కేజ్రీవాల్‌ను జైల్లో తీవ్రంగా వేధించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఇది అత్యంత ఆందోళనకరమైన అంశమన్నారు. మద్యం పాలసీ కేసులో ఈడీ, సీబీఐ అరెస్ట్ చేసిన తర్వాత ఏప్రిల్ 1 నుండి కేజ్రీవాల్ తీహార్ జైలులో ఉన్నారు. మార్చి 21న ఈడీ అరెస్ట్ చేసిన సమయంలో కేజ్రీవాల్ 70 కిలోలు ఉన్నారని, ఇప్పుడు ఆయన బరువు 61.5 కిలోలకు తగ్గిందని తెలిపారు. జైల్లో కేజ్రీవాల్‌ను చిత్రహింసలు పెట్టడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. ఆయన జీవితంతో ఆడుకోవడమే మోదీ లక్ష్యమని మండిపడ్డారు. కేజ్రీవాల్‌కు ఎలాంటి పరీక్షలు నిర్వహించకపోవడంతో బరువు ఎందుకు తగ్గుతున్నారో కారణం తెలియడం లేదన్నారు. బరువు తగ్గడం తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బరువు తగ్గడమే కాకుండా ఐదుసార్లు షుగర్ లెవల్స్ పడిపోయాయన్నారు. ప్రతిసారి షుగర్ లెవల్స్ పడిపోతున్నాయంటే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు.

# ఆసీస్ పై ఫోర్లు, సిక్సర్లతో యువరాజ్ సింగ్ వీరవిహారం..

**నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 28 బంతుల్లోనే 59 పరుగులు బాదిన వెటరన్**

**వరల్డ్ ఛాంపియన్ షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీ సెమీస్ లో భారత్ ఛాంపియన్స్ భారీ స్కోర్**

**యువరాజ్ బ్యాటింగ్ లో నేటికీ పవర్ తగ్గలేదంటున్న ఫ్యాన్స్**




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తన విధ్వంసకర బ్యాటింగ్ తో ఆస్ట్రేలియాకు చుక్కలు చూపించాడు. నార్త్ హాంప్టన్ లో జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్ షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీ సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియా ఛాంపియన్స్ పై వీరవిహారం చేశాడు. నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లు బాది 28 బంతుల్లోనే ఏకంగా 59 పరుగులతో సత్తా చాటాడు.ఇందుకు సంబంధించిన వీడియోను అభిమానులు సోషల్ మీడియాలో పంచుకున్నారు. యువరాజ్ ఆడిన విధానం చూసి అతని బ్యాటింగ్ లో నేటికీ పవర్ తగ్గలేదని సంబరపడుతున్నారు. ముఖ్యంగా ఆస్ట్రేలియాతో మ్యాచ్ లలో గతంలో అతను బాగా రాణించాడంటూ గుర్తుచేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన పాత ఫొటోలు, ఆసీస్ పై అతను సాధించిన భారీ స్కోర్లను నెట్ లో షేర్ చేస్తున్నారు. ఈ మ్యాచ్ లో యువరాజ్ దూకుడుతో ఇండియా చాంపియన్స్ ఏకంగా 254 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఈ మ్యాచ్ లో ఇండియా చాంపియన్స్ తొలుత బ్యాటింగ్ కు దిగింది. రాబిన్ ఊతప్ప 65 పరుగులు చేయగా యూసుఫ్ పఠాన్ 51 పరుగులు, ఇర్ఫాన్ పఠాన్ 50 పరుగులు చేశారు. ఛేజింగ్ కు దిగిన ఆస్ట్రేలియా ఛాంపియన్స్ కేవలం 168 పరుగులకే చతికిలపడింది. మొత్తంగా ఏడు వికెట్లు కోల్పోయింది. ధావల్ కులకర్ణి, పవన్ నేగి చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఈ విజయంతో ఇండియా ఛాంపియన్స్ జట్టు ఫైనల్ చేరుకుంది. సురేష్ రైనా సారథ్యంలోని ఇండియా ఛాంపియన్స్ జట్టు ఫైనల్ లో పాకిస్థాన్ ఛాంపియన్స్ జట్టుతో శనివారం తలపడనుంది. గ్రూప్ స్టేజిలో పాక్ తో మ్యాచ్ లో 68 పరుగుల తేడాతో ఓటమిపాలైన ఇండియా ఛాంపియన్స్.. అందుకు ఫైనల్ లో ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది.

# వికెట్ పడకుండా కొట్టారు.... సిరీస్ గెలిచారు!

**టీమిండియా-జింబాబ్వే మధ్య 5 మ్యాచ్ ల టీ20 సిరీస్**

**3-1తో సిరీస్ గెలిచిన టీమిండియా**

**4వ టీ20 మ్యాచ్ లో 10 వికెట్ల తేడాతో గెలిచిన టీమిండియా**

**153 పరుగుల టార్గెట్ ను 15.2 ఓవర్లలో కొట్టేసిన టీమిండియా ఓపెనర్లు**

**జైస్వాల్ 93 నాఔట్... కెప్టెన్ శుభ్ మాన్ గిల్ 58 నాటౌట్**



**హైదరాబాద్ పెన్ పవర్:** శుభ్ మాన్ గిల్ సారథ్యంలోని యువ టీమిండియా జట్టు జింబాబ్వేతో ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను 3-1తో కైవసం చేసుకుంది. హరారేలో ఇవాళ జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ లో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఆతిథ్య జింబాబ్వేను చిత్తు చేసింది. జింబాబ్వే నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఒక్క వికెట్ కూడా పడకుండా ఓపెనర్లే కొట్టేవారు. యశస్వి జైస్వాల్ 93, కెప్టెన్ గిల్ 58 పరుగులతో విజృంభించడంతో... టీమిండియా 15.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. జైస్వాల్ 53 బంతులు ఎదుర్కొని 13 ఫోర్లు, 2 సిక్సులు కొట్టగా... గిల్ 39 బంతులు ఆడి 6 ఫోర్లు, 2 సిక్సులు బాదాడు. వీరిద్దరి ధాటికి జింబాబ్వే బౌలర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఒక్క వికెట్టు కూడా తీయలేక ఉసూరుమన్నారు.

# 'ఛాంపియన్స్ ట్రోఫీ' కోసం పాక్ వెళ్లనంటున్న భారత్.. మరి ఐసీసీ ఏం చేయనుంది?

**భారత్ వైదొలగితే ఆ స్థానంలో ఆడనున్న శ్రీలంక**

**వన్డే వరల్డ్ కప్ 2023లో 9వ స్థానంలో నిలవడంతో అవకాశం**

**భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్‌లో ఆడబోమంటూ ఐసీసీకి తెలిపిన బీసీసీఐ**

**తటస్థ వేదికల్లో నిర్వహించాలని ప్రతిపాదన**



**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు పాకిస్థాన్ అతిథ్యం ఇస్తోంది. అయితే భారత క్రికెట్ జట్టు ఆ దేశానికి వెళ్లేందుకు బీసీసీఐ ససేమిరా అంటున్నట్టు తెలుస్తోంది. అయితే పాకిస్థాన్ మాత్రం టోర్నీకి సంబంధించిన ముసాయిదా షెడ్యూల్‌ను ఐసీసీకి సమర్పించింది. భారత్ ఆడే అన్ని మ్యాచ్‌లకు లాహోర్‌ను ఏకైక వేదికగా పేర్కొంది. అయితే ఆటగాళ్ల భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్‌కు జట్టుని పంపించలేమంటూ ఐసీసీకి బీసీసీఐ చెప్పినట్టుగా తెలుస్తోంది. హైబ్రిడ్ మోడల్‌లో తమ మ్యాచ్‌లకు దుబాయ్ లేదా శ్రీలంక వంటి తటస్థ వేదికలకు మార్చాలని కోరినట్టు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. బీసీసీఐ విజ్ఞప్తిపై ఐసీసీలో ఇప్పటివరకు అధికారిక చర్చ జరగలేదు. బీసీసీఐ ప్రతిపాదనపై అధికారిక చర్చ ఇంకా జరగలేదు. అయితే భారత్ డిమాండ్‌కు అంగీకరించడం తప్ప పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు మరొక ఆప్షన్ ఉండకపోవచ్చునని క్రికెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పాకిస్థాన్‌లో ఆడేందుకు బీసీసీఐకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించడం దాదాపు అసంభవంగా కనిపిస్తోంది. ఒకవేళ పాకిస్థాన్ అంగీకరించకుండా అన్ని మ్యాచ్‌లూ పాకిస్థాన్‌లోనే జరగాలని పట్టుపడితే టోర్నీ నుంచి నిష్క్రమించడం తప్ప భారత్‌కు వేరే ఆప్షన్ ఉండదు. ఒకవేళ ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి భారత్ వైదొలిగితే ఆ స్థానంలో శ్రీలంక ఆడాల్సి ఉంటుంది. 2023 వన్డే వరల్డ్ కప్‌లో 9వ స్థానంలో నిలవడంతో శ్రీలంకకు ఈ ఛాన్స్ దక్కుతుంది. కాగా గతేడాది జరిగిన ఆసియా కప్ 2023కు కూడా పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చింది. అక్కడికి వెళ్లి ఆడేందుకు భారత్ నిరాకరించడంతో భారత్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించారు. కాగా 2008లో ఆసియా కప్ తర్వాత భారత క్రికెట్ జట్టు ఇప్పటివరకు పాకిస్థాన్‌లో ఆడలేదు. ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లకు భారత్-పాకిస్థాన్ దూరంగా ఉంటున్నాయి. ఐసీసీ లేదా ఆసియా కప్‌లలో మాత్రమే ఈ రెండు జట్లు తలపడుతున్నాయి.

**నికితా దత్తా యొక్క అద్భుతమైన ఇన్‌స్టాగ్రామ్ ఫోటోలు సోషల్ మీడియా ఫ్రెంజీని**



# అనుష్క కంటే ముందు విరాట్‌తో రెండేళ్లు ప్రేమలో?



విరాట్ కోహ్లీ- అనుష్క శర్మ జంట ప్రేమాయణం, పెళ్లి అంతా ఒక అందమైన కల. ఇప్పుడు ఈ జంటకు ఒక కుమార్తె కూడా ఉంది. వన్ ఫైన్ డే డెస్టినేషన్ వెడ్డింగ్ తో ఒకటయ్యే ముందు ఈ జంట షికార్లు నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లో నిలిచేవి. అయితే విరాట్ ఒక్కరితోనే డేటింగ్ చేసాడా? అనుష్కను ప్రేమించక ముందు ఎవరితోను డేటింగ్ చేయలేదా? అంటే దానికి సమాధానం ఇక్కడ ఉంది.ఐబాలీవుడ్ ట్యాలెంటెడ్ గర్ల్ అనుష్క శర్మతో డేటింగ్ ప్రారంబించక ముందు విరాట్ మనసు దోచిన మరో అందగత్తె కూడా ఉంది. ఈ బ్యూటీ పేరు ఇజబెల్లా లైట్. ఈ విదేశీ అందగత్తెకు విరాట్ అత్యంత సన్నిహితుడు. బాలీవుడ్ స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా కూడా తనకు స్నేహితుడు అని ఇజబెల్లా పలుమార్లు వెల్లడించింది. కానీ ఆ ఇద్దరిలో ఎవరిని ప్రేమించింది? అనే విషయాన్ని కూడా ఓ ఇంటర్వ్యూలో ఓపెనైంది.

పురాణీ జీన్స్‌లో తనూజ్ విర్వాణితో కలిసి నటించిన జాబెల్లె లైట్ అందానికి భారతీయులు ఫిదా అయిపోయారు. కాలక్రమంలో కరణ్ జోహార్ కాఫీ షోలో ఇజబెల్లా ప్రత్యక్షమైంది. విరాట్ తో స్నేహాన్ని ఈ బ్యూటీ ఖండించలేదు. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రా స్నేహితుడు అని కూడా తెలిపింది. ఇప్పటికీ తాము కలుస్తుంటామని వెల్లడించింది. నా మగ స్నేహితుల మీద ఈ రకమైన శ్రద్ధ .. ఇప్పటికి మూడు అనుభవాలతో ముడిపడి ఉన్నాయి. కానీ నేను చాలా ఇబ్బందిగా భావిస్తున్నాను. నేను నా పని గురించి తప్ప ప్రతిచోటా కనిపించాలని వినిపించాలని కోరుకునే అమ్మాయిని కాదు... అని తెలిపింది. ఇజాబెల్లె తన జీవితంపై మీడియా అసత్యాలు రాసిందని వాపోయింది. %--%మీడియాలోని కొన్ని వర్గాలు నా గురించి చాలా ఎక్కువ ప్రచారం చేసాయి. ఆ పుకార్లేవీ నిజాలు కావు... ఫరవాలేదులే... నేను ఈ వృత్తిలో ఉన్నాను. అక్కడ ప్రజలు నా జీవితం గురించి ఆసక్తిగా ఉంటారు. ఇది నా పనిలో భాగం కాబట్టి నేను అర్థం చేసుకున్నాను... అని అన్నారు. తొలి చిత్రం %-%పురాణీ జీన్స్ %-%సహనటుడు తనున్ విర్వాణితో లింక్-అప్ పుకార్లు కూడా ఉన్నాయి. కానీ వాటిని ఇజబెల్లే ఖండించింది. %--%తనుజ్ నా సహనటుడు.. మేము పురాణి జీన్స్ కోసం వర్క్‌షాప్‌లను ప్రారంభించినప్పటి నుండి నిజంగా మంచి స్నేహితులం అయ్యాము. మేం ఎల్లప్పుడూ ఒకరినొకరు కలుస్తాము. అతని తల్లిదండ్రులు కూడా నాకు తెలుసు. వారు నాకు చాలా మంచి కుటుంబం వంటి వారు. అంతకు మించి ఏదీ లేదు%--% అని తెలిపింది. క్రికెటర్ విరాట్ కోహ్లీతో డేటింగ్ చేస్తున్నట్టు ఇజాబెల్లె అంగీకరించింది. నేను ఇండియా వచ్చినప్పుడు నా మొదటి భారతీయ స్నేహితుల్లో విరాట్ ఒకడు. మేము చాలా కాలం పాటు డేటింగ్ చేసాము. దాదాపు రెండేళ్లు కలిసి ఉన్నాం. కానీ మేము దానిని పబ్లిక్ చేయదలచుకోలేదు. కాబట్టి విరాట్ తో నాకు సంబంధం ఉంది. కానీ సిద్ధార్థ్ నాకు స్నేహితుడు మాత్రమే.. మేం కలిసి సమయాన్ని కూడా గడుపుతాము... అని నిజాయితీగా మాట్లాడింది.

**పాయల్ రాజ్‌పుత్ యొక్క అద్భుతమైన ఫోటోషూట్ మూమెంట్స్**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com